పడకేసిన వైద్య సేవలు


ఆస్పత్రిలోని ల్యాబ్



- పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో కనిపించని ప్రత్యేక వైద్యులు
- వెలవెలబోతున్న ఆరోగ్య కేంద్రాలు
- పేదలకు అందని ద్రాక్షలా పరీక్షలు.. చికిత్సలు

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి పేదవాడికి వైద్య సేవలు అందించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వారాంతపు ప్రత్యేక వైద్య నిపుణుల సేవలు నిలిచిపోవడంతో పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్యం బాగులేకపోతే ఎక్కడికో వెళ్లి వైద్యం చేయించుకునే బాధ లేకుండా ఇంటి ముంగిటకే జగనన్న వైద్యం అందించేవారని.. ఆ సేవలు ఆగిపోవడంతో తాము ఎక్కడికి వెళ్లేదని వారు ప్రశ్నిస్తున్నారు.

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు పరిధిలో ఉన్న ప్రసాద్‌గార్డెన్స్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో అప్పట్లో పండావీధి, వెలంపేట, రామకృష్ణానగర్ తదితర ప్రాంతాలకు చెందిన వారు వైద్య పరీక్షలు చేయించుకుని, తదనుగుణమైన సేవలను పొందేవారు. దీంతో రోజుకు రెండు వందల నుండి మూడు వందల మంది వరకు ఆ ఆరోగ్య కేంద్రానికి వచ్చేవారు. నిత్యం రోగులతో ఆరోగ్య కేంద్రం కళకళలాడేది. కానీ ప్రత్యేక వైద్య సేవలు నిలిపేసిన తర్వాత రోజుకు 50 మంది కూడా రావడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైద్య సేవల కోసం ప్రైవేట్ క్లినిక్‌లకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వస్తుందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగనన్న పాలనలో సోమవారం నుంచి శనివారం వరకు ప్రత్యేక వైద్య నిపుణులు వచ్చేవారని.. ఒక వారం రాకపోయినా తర్వాతైనా వస్తారనే ధీమాతో ఉండేవారమని చెబుతున్నారు. ఇప్పుడా సేవలు నిలిపివేయడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదంటున్నారు. ప్రభుత్వాలు మారినంత మాత్రాన ప్రజలకు అందే సేవలను నిలిపివేయడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.


ప్రసాద్‌గార్డెన్స్‌లోని ముఖ్యమంత్రి పట్టణ ఆరోగ్య కేంద్రం

జగనన్న పాలనలో వారమంతా అందిన వైద్య సేవలు

- **సోమవారం :** జనరల్ పరీక్షలు, వైద్య సేవలు
- **మంగళవారం:** ప్రసూతి, ఎముకల పరీక్షలు, వైద్య సేవలు
- **బుధవారం:** చిన్నపిల్లలకు పరీక్షలు, వైద్య సేవలు
- **గురువారం:** చర్మవ్యాధుల పరీక్షలు, వైద్య సేవలు
- **శుక్రవారం:** ఈఎన్‌టీ, జనరల్ పరీక్షలు, వైద్య సేవలు
- **శనివారం:** గుండెకు సంబంధించిన పరీక్షలు, వైద్య సేవలు

వైద్యమందక ఇబ్బంది పడుతున్నాం..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దే వైద్యం పొందేవాళ్లం. ఇప్పుడు ఆ సేవలు నిలిపివేశారు. వారమంతా రోజుకొక డాక్టర్ వచ్చేవారు. వారు కూడా ఇప్పుడు రావడంలేదు. దీంతో ఎక్కడికో వెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వస్తుంది. ఇది మాలాంటి వృద్ధులకు కష్టమే.

– నీలాపు రాజులమ్మ, ప్రసాద్‌గార్డెన్స్, 35వ వార్డు

ప్రత్యేక వైద్యసేవలు ఆగిపోయాయి..



కూటమి ప్రభుత్వం నిజంగా పేదల ప్రభుత్వం అయితే మళ్లీ ఆరోగ్య కేంద్రాల్లో వారాంతపు వైద్య నిపుణుల సేవలు ప్రారంభించాలి. రోగులకు కావలసిన మందులు అందుబాటులో ఉంచాలి. పేదవాడి ముంగిటకు వైద్యం తీసుకురావాలి.

– అలపన దేముడు, పండావీధి, జీవీఎంసీ 35వ వార్డు

ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరించాలి..



జగనన్న ప్రభుత్వ హయాంలో ఉచితంగా అందిన వైద్య సేవలు కూటమి ప్రభుత్వం నిలిపివేసింది కనుక వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలి. పేదలకు కార్పొరేట్ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి. ప్రత్యేక వైద్యుల సేవలను తిరిగి ప్రారంభించాలి.

– సత్యనారాయణరావు, వెలంపేట, 35వ వార్డు

వైద్య శిబిరాల మాటే లేదు..



జగనన్న ప్రత్యేక వైద్యుల సేవలతో పాటు వార్డుల వారీగా వైద్య శిబిరాలు పెట్టించి సేవలందించేవారు. ఈ ప్రభుత్వం వచ్చి ఏడు నెలలవుతోంది. ఏ సేవలు లేవు. ఎందరో వృద్ధులు అనేక రకాల వ్యాధులతో బాధపడుతున్నారు. వారికి సరైన వైద్యం అందించాలి.

– నీలాపు నాగమణి, రామకృష్ణానగర్, 35వ వార్డు

నూతన జీవోలతో ఆటో కార్మికులపై అధిక భారం


మాట్లాడుతున్న షేక్ రహ్మాన్

దాబాగార్డెన్స్:

ఈ నెల 30, 31 తేదీల్లో విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ రాష్ట్ర 4వ మహాసభలు జరగనున్నాయని విశాఖ జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం (ఏఐటీయూసీ) అధ్యక్షుడు షేక్ రహ్మాన్ తెలిపారు. టౌన్ కొత్తరోడ్డు సున్నపు వీధి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన దుర్గా గణపతి ఆటో స్టాండ్‌ను సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ కాసుబాబుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధిక జరిమానాలు విధించే జీవో 21, 31 రద్దు చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటోమోటార్ కార్మికులపై రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానాలు విధించే విధంగా ఉన్నాయన్నారు. ఇప్పటికే పెరిగిన ఇన్సూరెన్స్, ఆర్టీఏ చలానా చార్జీలు సకాలంలో చెల్లించుకోలేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం కొత్త జీవోలు తీసుకురావడం వల్ల ఆటో మోటార్ కార్మికుల పీకకు ఉరి తగిలించే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రెండు జీవోలు వెంటనే రద్దు చేయాలని, భారీగా పెరిగిన ఆర్టీఏ చలానా చార్జీలు తగ్గించాలని, పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు జీఎస్టీ పరిధిలోకి తేవాలని, ఆటో కార్మికులకు ఆదాయం పెరిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్. సత్యనారాయణ, జి. సతీష్, బి. వేణుగోపాల్, డి. జగ్గారావు, జి. పాపారావు, బి. సూర్యనారాయణ, వి. శ్రీను, జి. త్రినాథ్, టి. శ్రీనివాసరావు, ఎస్. రాము తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం


పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాదస్వర కళాకారులకు సత్కారం


కచేరీ నిర్వహిస్తున్న నాదస్వర, డోలు కళాకారులు


దాబాగార్డెన్స్: తంజావూర్ జిల్లా తిరువాయూర్ త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవ కమిటీ ఆహ్వానం మేరకు నగరానికి చెందిన నాదస్వర కళాకారులు త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్యాగరాజ స్వామి సంకీర్తనలతో శ్రవణానంద భరితంగా నాదస్వర కచేరీ నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు. నాదస్వర కళాకారులు పి. దయాకర్, పి. భాస్కర్ (సన్నాయి), కె. గోవిందరావు, గూడూరు నితీష్‌కుమార్ (డోలు) మంజు (తాళం) సహకారంతో పలు త్యాగరాజస్వామి సంకీర్తనలు ఆలపించారు. కచేరీ అనంతరం సత్కరించినట్టు నాదస్వర కళాకారుల కమిటీ సభ్యులు తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి కేసు ముద్దాయి


ముద్దాయిని పట్టుకున్న వన్‌టౌన్ పోలీసులు

దాబాగార్డెన్స్: గంజాయి కేసులో గత కొంత కాలంగా తప్పించుకు తిరుగుతున్న ముద్దాయి పి. ప్రసాద్ అలియాస్ ప్రకాష్‌ను గురువారం వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. సిమ్మర్ శ్రీను, అహ్మద్‌తో కూడిన స్పెషల్ టీమ్ మాటువేసి చాకచాక్యంగా పట్టుకోగలిగారని సీఐ జీడీ బాబు తెలిపారు. పట్టుబడ్డ ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

స్వగ్రామానికి అభాగ్యుడు


బీహార్ రైలులో రాజహాన్స్

సీతమ్మధార: బీహార్‌లోని పాట్నాకు చెందిన రాజహాన్స్ (43) నడవలేని స్థితిలో ఉండగా నవంబర్ 2024లో విశాఖ రైల్వేస్టేషన్‌లో అతన్ని గుర్తించి ఏయూటీడీ షెల్టర్ హోంకు తరలించారు. అతనికి కేజీహెచ్‌లో చికిత్స ఇప్పించారు. అతను కోలుకున్న తర్వాత మరి కొన్నాళ్లు షెల్టర్ హోంలో ఉంచి గురువారం అతని స్వగ్రామానికి తరలించారు.

నేతాజీకి ఘన నివాళి


నేతాజీకి నివాళులర్పిస్తున్న వివేకానంద సంస్థ సభ్యులు, పిల్లలు


నేతాజీకి నివాళులు అర్పిస్తున్న పరశురామరాజు తదితరులు

దాబాగార్డెన్స్: పాతనగరంలో గల స్వామి వివేకానంద సంస్థలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ముందుగా సంస్థ సభ్యులు, ట్యూషన్ విద్యార్థులు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ నేతాజీ జయంతిని అధికారికంగా పరాక్రమ దివస్ అని పిలుస్తారని, సుభాష్ చంద్రబోస్ ప్రముఖ భారతీయ స్వాతంత్ర్య సమరయోధుడని పేర్కొన్నారు. బోస్ ఆర్మీ అధిపతిగా సేవలందించారని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, ట్యూషన్ పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ ఒక ప్రభంజనం..

దాబాగార్డెన్స్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి రోటరీక్లబ్ వైజాగ్ మెట్రో ఆధ్వర్యంలో ఇసుకతోట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రొటేరియన్ మొదిలి మహేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు, క్లబ్ పూర్వ అధ్యక్షుడు పరశురామరాజు, రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ కె. సునీత లావణ్య పాల్గొని మాట్లాడారు. నేతాజీ ఒక ప్రభంజనం అని తెలిపారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో నేతాజీ పాత్రను క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనుపమ, బోధన, బోధనేతర సిబ్బంది, క్లబ్ డైరెక్టర్లు ఇమ్మి కిరణ్, పీబీఎస్ఎన్ రెడ్డి, వెంకట్, ఎ. కిరణ్, తిరుపతిరావు, క్లబ్ పూర్వ అధ్యక్షుడు కె. కిరణ్‌కుమార్, కోశాధికారి బైరెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

26న రాచపోలమాంబ పరస



దాబాగార్డెన్స్: అల్లిపురంలోని గోకుల్ థియేటర్ సమీపాన వెలసిన గ్రామదేవత రాచపోలమాంబ 21వ పరస మహోత్సవం ఈ నెల 26న ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉత్సవ కమిటీ ముమ్మరంగా ఏర్పాటు చేస్తున్నారు. 24 నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు చెప్పారు. 25 సాయంత్రం 4 గంటల నుంచి అమ్మవారి తిరువీధి మహోత్సవం ఉంటుందని, 26 వేకువజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు పెద్ద ఎత్తున నిర్వహించడమే కాక ప్రసాద వితరణ చేపట్టనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. పరస మహోత్సవాన్ని పురస్కరించుకుని సాయంత్రం భక్తి గీతాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం రాజీనామాలు చేయాల్సింది ఉద్యోగులు కాదని.. కూటమి నాయకులని సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, కార్యదర్శి బి.జగన్ పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1400 రోజుల నుంచి కార్మికులు, ప్రజలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పోరాడుతున్నట్లు తెలిపారు. ఈ పోరాట ఫలితంగానే స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ఒక్క శాతం కూడా ప్రైవేట్‌పరం చేయలేకపోయిందన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులు ఏ రోజు తమకు ప్యాకేజీ కావాలని కోరలేదన్నారు. బీజేపీ నాయకులు పనిగట్టుకుని స్టీల్‌ప్లాంట్ కార్మికులు చేస్తున్న పోరాటాన్ని అవహేళన చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ మాట్లాడుతూ ఈ ప్యాకేజీ సరిపోకపోతే ఉద్యోగులు రాజీనామాలు చేసి వెళ్లిపోవాలనడం దుర్మార్గం అన్నారు. ప్రజా పోరాటాలను అవహేళన చేసిన వారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారన్నారు. ఇప్పటికైనా బీజేపీ, కూటమి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలన్నారు. కార్మికులను, పోరాటాలను అవహేళన చేసే ప్రకటనలు మానుకోవాలని డిమాండ్ చేశారు.

పౌష్టికాహారంతో ఆరోగ్య సంరక్షణ


మాట్లాడుతున్న పీడీ జయదేవి

సీతమ్మధార : బాలికలకు తగినంత పౌష్టికాహారం అందేలా చూడాలని జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవి సూచించారు. చినగదిలి మండలం అంగన్‌వాడీ సిబ్బందికి, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, స్కూల్ నోడల్ టీచర్లు, విద్యా కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బందికి కిశోరీ బాలికల సంరక్షణపై రేసపువానిపాలెంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోరీ బాలికలు రక్తహీనతకు గురికాకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తగినంత పౌష్టికాహారం అందజేస్తున్నామని గుర్తు చేశారు. కౌమార దశ పిల్లల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. బాల్య వివాహాలు జరగకుండా విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ నెల 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని పండగలా నిర్వహించాలని సూచించారు. సీడీపీవో ఎం.వి.రమణ కుమారి మాట్లాడుతూ కౌమార దశ అనేది చాలా క్లిష్టమైందన్నారు. మెడికల్ ఆఫీసర్ మన్మోహన్, అప్ హోల్డ్ ఎన్జీవో జిల్లా కో ఆర్డినేటర్ డేవిడ్ రాజ్ వివిధ చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో శ్రీలత, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మేరా భారత్ మహాన్



పోలీస్ బ్యారెక్స్‌లో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థినులు గురువారం రిహార్సల్స్ చేశారు.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

పోలీసులకు ఆరోగ్య రక్ష



సిరిపురం జంక్షన్‌లో విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు గురువారం కేజీహెచ్ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఇప్పటికే కేజీహెచ్‌లో పోలీసులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. గతంలో పరీక్షలకు హాజరు కాని వారు ఎక్కడ విధి నిర్వహణలో ఉంటే అక్కడికి వెళ్లి పరీక్షలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సిరిపురం ట్రాఫిక్ ఔట్‌పోస్టులో ఉన్న పోలీసులకు వైద్య పరీక్షలు చేశారు.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కాలి.. కూలిపోయిన బతుకు బండి

నూతన సంవత్సరంలోనైనా ఆనందంగా గడుపుదామనుకుంది ఆ కుటుంబం. కానీ విధి వక్రించింది. కొంత మంది ఆకతాయిల వికృత చేష్టలకు ఆ కుటుంబం రోడ్డున పడింది. ఆ తల్లికి కన్నీరే మిగిలింది. అన్నీ తానై ఆ తల్లి తన రెక్కల కష్టంతో కుటుంబాన్ని ఈడ్చుకొస్తున్నా.. కష్టాల ఆవలి తీరాన్ని మాత్రం దాటలేకపోయింది.


భోగి మంటల్లో కాలిపోయిన బతుకు బండి


పద్మ కుటుంబానికి ఆసరాగా నిలిచిన టీ బండి (ఫైల్)


రోడ్డున పడ్డామంటూ రోదిస్తున్న పద్మ కుమార్తె గురమ్మ

- కష్టాలను ధైర్యంగా ఎదిరించిన మహిళ పట్ల విధి చిన్నచూపు
- బతుకు తెరువుకు ఆసరాగా నిలిచిన టీ బండి భోగి మంటలకు ఆహుతి
- ఆకతాయిల వికృత చేష్టలతో ఉపాధి కోల్పోయిన కుటుంబం

దాబాగార్డెన్స్: పాతనగరంలోని 39వ వార్డు ఫెర్రీరోడ్డులో పద్మ అనే మహిళ నివసిస్తోంది. భర్త కృష్ణ (బోటులో పనికి వెళ్లేవాడు) 30 ఏళ్ల కిందట పాము కాటుకు బలయ్యాడు. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త చనిపోయిన సమయానికి కుమార్తెకు రెండేళ్లు.. కుమారుడికి ఏడు నెలలు. అప్పటి నుంచి పద్మ అన్నీ తానై, కూలి పనులు చేసుకుంటూ ఆ ఇద్దరు పిల్లల్ని పోషించుకొచ్చింది. 2006లో కుమార్తె గురమ్మకు వివాహం చేసింది. పెళ్లయిన మూడేళ్లకే భర్త గురమ్మను వదిలేశాడు. వీరికి ఓ పాప, బాబు. పాప ప్రస్తుతం ఇంటర్ చదువుతోంది. బాబు (రాజేష్) పదో తరగతి ఫెయిల్ అయ్యాడు. గురమ్మ తల్లి వద్దే ఉంటోంది. గురమ్మ కుమారుడు చిన్నప్పుడు తోటి పిల్లలతో ఆడుకునే సమయంలో రాయి తగిలి చూపు కోల్పోయాడు. పద్మ కుమారుడు రాజు ఆటో నడుపుతూ వేరేగా ఉంటున్నాడు.

ఒంటరి పోరాటం..

గత ఏడేళ్లుగా పద్మ పోర్టు పరిసర ప్రాంతాల్లో తోపుడు బండిపై టీ విక్రయిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. కుమార్తె గురమ్మ కూడా తల్లికి సాయమందిస్తోంది. పద్మకు ఆరోగ్యం చెడింది. పోర్టు కాలుష్యం కారణంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ మంచం పట్టింది. ఆ కుటుంబానికి బాసటగా నిలిచిన తోపుడు బండిని ఓ మూలన పెట్టుకుంది. కొంత మంది ఆకతాయిలు ఆ బండిని భోగి పండగ రోజు భోగి మంటల్లో కలిపేశారు. సమాచారం తెలుసుకున్న ఆ తల్లీకూతుళ్లు మంటల్లో కాలిపోతున్న బండిని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. అప్పటికే ఆ బండి పూర్తిగా కాలి బూడిదైంది. ఈ విషయం అందర్నీ అడిగారు. ఫలితం లేకపోయింది. పోలీసులను ఆశ్రయించారు. సీసీ కెమెరాలో రికార్డు కాలేదని చెప్పారు. దీంతో ఏం చెయ్యాలో తెలియక సతమతమవుతున్నారు. తల్లి మంచం పట్టడంతో కుమార్తె గురమ్మ నగరంలోని పెట్రోల్ బంక్‌లో పని చేస్తోంది. దాతలు సహకరించాలని వేడుకుంటున్నారు.

తల్లికి పింఛన్ లేదు..

భర్త చనిపోయి 30 ఏళ్లయింది. అప్పటి నుంచి కూలి పనులు చేసుకుంటున్న పద్మకు పింఛన్ లేదు. కారణం.. అప్పట్లో వారు ఉంటున్న ఇల్లు కాలి బూడిదయింది. ఆ మంటల్లో భర్త మరణానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు కూడా కాలిపోయాయి. పింఛన్‌కు దరఖాస్తు పెట్టుకుంటే భర్త మరణ ధ్రువీకరణ పత్రం తెమ్మంటున్నారని, లేదంటే పింఛన్ కష్టమని అధికారులు తెలిపినట్టు పద్మ 'సాక్షి'కి తెలిపింది.

వేణుగాన విద్వాంసుడు నవీన్‌కుమార్ ఏయూ సందర్శన


నవీన్‌కుమార్‌ను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య : ప్రముఖ వేణుగాన విద్వాంసుడు, సంగీత దర్శకుడు పి.ఎం.కె.నవీన్‌కుమార్ గురువారం ఏయూలోని సెయింట్ లూక్స్ ఆడియో ఇంజినీరింగ్ మ్యూజిక్ ప్రొడక్షన్ విభాగాన్ని సందర్శించారు. ఆధునిక ప్రమాణాలతో నిర్మించిన సెయింట్ లూక్స్ డిజిటల్ స్టూడియో చూసి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఆడియో ఇంజినీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ విద్యార్థులకు, వుడ్ విండ్స్ వాయిద్యం విభాగంలో మాస్టర్ క్లాస్ నిర్వహించారు. వేణుగానం మెలకువలను విద్యార్థులకు నేర్పించారు. కార్యక్రమంలో సెయింట్ లూక్స్ ఆడియో ఇంజినీరింగ్ అండ్ మ్యూజిక్ ప్రొడక్షన్ విద్యార్థులతో పాటు డైరెక్టర్ ఆశీర్వాద్ లూక్, సుమన్ జీవరతన్, ప్రీతంలూక్ వర్సిటీ ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తన కార్యాలయంలో నవీన్‌కుమార్‌ను సత్కరించారు.